# రైలు కట్ట

గుంటూరు లక్ష్మీగణపతి శాస్త్రి

మా వూరికి రైల్వేస్టేషను లేదు. కాని రైల్వేలైను మావూరి ప్రక్కనుంచే పోతుంది.

ఆ రైలుకట్టకు రెండువేపులా పచ్చని వరిచేలు, చేలమధ్య తెల్లటి పంటచెరువులు. చెరువుగట్లమీద అరటి. వంగ, బెండ మొక్కలు. దిమ్మలమీద గడ్డివాములు. వాములనిండా అల్లుకున్న బీరపాదులు. పాదులనిండా మూడు పువ్వులు, ఆరు కాయలు.

ఎత్తుగా ఏటిగట్టులా ఉంటుంది రైలుకట్ట. కట్టవెంబడి దట్టంగా పట్టిన పచ్చిక. కట్టమీద ఎర్రనికంకర. కంకరమీద ఎండలో తళతళలాడే నల్లత్రాచులవంటి రైలుపట్టాలు. మావూరినుంచి చూస్తే ఎర్రని పెద్ద రోకలి బండలా కనిపిస్తోవుంటుంది ఆ రైలుకట్ట.

ఆ రైలుకట్టవెంబడి బయలుదేరతారు - కనుచీకటితోనే పొలం యజమానులు - కిర్రు చెప్పులు, చేతిలో కర్రా, చెంబు. మోకాళ్ల వరకు ఎగకట్టిన పంచె. ముతకఖద్దరులాల్చీ, చలికి తలమీదుగా వంటినిండా కప్పుకున్న తెల్లఖండువాతో జోడించిన ఎర్రశాలువా, తాటాకు గొడుగులతో.

కొంచెం వెలుగువచ్చేవేళకి మొదలు - రైతులు, నాగళ్లు, మరకారెములతో, దుక్కి పశువులను తోలుకొంటూ.

చెట్లగుబుర్లలోనుంచి సూదుల్లాంటికిరణాలతో పొడుస్తూ, సూర్యు డుదయించేవేళకు, పచ్చికమీద పట్టినమంచు - ఇంద్రధనస్సులోని రంగులన్నిటినీ విరజిమ్మే ముత్యాలు - ఎండలో మాయమౌతాయి

ఈలోగా, దూరాన మంచులో కనబడకుండా వచ్చే నల్లని మెయిలింజను, రైలుకట్టవెంబడిపోయే రైతులను, పశువులను, టెలిగ్రాఫ్ తీగలమీది పిట్టలనూ, భయమనే కూతతో చెదరగొట్టి, రైలుకట్టనంతనీ దడదడలాడించి, రైలుపట్టాలను కసిదీరా విల్లువంచినట్టువంచి, టకటకలాడించి, వెళ్లిపోతుంది - యింతపొగ - నల్లటిరాతుసిబొగ్గుపొగ రైలుకట్ట ముఖాన్ని కొట్టి.

సూర్యుడు చురచురలాడే జాముప్రొద్దెక్కే వేళకు కాపుపడుచులు, మాలెతలు బయలుదేరతారు - ఊడ్పులకూ, కలుపు తీతలకూ, కారంమీద నీళ్లతోడేందుకూ-రంగురంగుల చీరలు మోకాళ్లవరకు బిగించి కట్టుకుని. వెలవెలబోయే కడియాలతో, తళతళలాడే గాజులతో నున్నటి కొప్పులలో తురిమిన పచ్చటి పువ్వులతో, ఎండలో మెరిసే టిఫిన్ కారియర్లతో, గలగల కబురు చెప్పుకుంటూ, కిలకిలా నవ్వుకుంటూ, లేళ్లలా పరుగెత్తుతూ

పదిగంటలయ్యేసరికి. గేదెలమంద-నల్లగా, ఎండలో మెరిసే నల్లబండరాళ్లవంటి గేదెల మధ్య తెల్లని ఆవులు- ఎండలో మరీ తెల్లగా కనబడి మాపులను చెదరగొడుతూ.

ఇంత మందకూ వెనక ఎక్కడున్నాడో కనబడరు - ఇద్దరు ముగ్గురు బుడతలు, - వేలెడంత కుర్రాళ్లు. వాళ్లదగ్గ రేమీ ఉండదు - వెలిసిపోయిన ఎర్రమొలతాడుకి జానెడు గోచీపేలిక. రెండుజానల తువ్వాలుగుడ్డ తలకు చుట్టుకు సేంచుకు. చేతిలో కర్ర ముక్కలు - గోటీబిళ్ళ ఆటలోకీ, మెత్తటి రాగిటి నేలలో విసిరి గుచ్చే ఆటలోకీ, పని కొచ్చే విధంగా సూదిమొనలుగా చెక్కకున్నవి - తప్ప. ఎండల్లో తిరిగినందువల్ల, నల్లగా మాడిపోయి నిగనిగలాడే శరీరం, వానల్లో తడిసి, ఎండకు ఎండినందువల్ల, ఎర్రబడి రాగిపీచులాగవున్న జుట్టు.

మంద రైలుకట్ట ప్రక్కల్నీ పచ్చగడ్డి కొరుకుతూ వుంటుంది. ఈ కుర్రాళ్ళు పట్టాలమీదకూళ్ళని, గేదెలమీదికీ, నీళ్ళల్లోకీ, పట్టాలమీదికీ, కంకరరాళ్లు విసురుతూ, వింతలూ, విశేషాలూ చెప్పుకుంటుంటారు. ఇంతలో ఒక గేది ప్రక్క చేలో బడుతుంది అక్కడినించి ఆ రైతు తిట్లు. "యదవల్లారా! ఎక్కడ చచ్చినార్రా! కళ్లు కనపడ్డం లేదట్రా!" ఒకడు పరుగెత్తుకునివెళ్ళి, తాటికమ్మతో గేదెను నాలుగు బాది, కసిదీరా తిట్టి, దానిమీదెక్కి సవ్వారీ చేస్తాడు.

ఇంతట్లో వస్తుంది ట్రాలీ - రైల్వేట్రాలీ. ఎర్రటి జెండా - దొర టోపీతో, ఖాకీ లాగు, తెల్లచొక్కాలతో, బొజ్జింక మీసాలతో ఆఫీసరూ, వెనకవైపుని పట్టాలమీద పరుగెత్తి బండినితోసే గాంగు కూలీలూ.

ఆ బండిని చూడగానే వీళ్లు దులుపుకుని లేచి, మందని కదలేసి, తోలుకుని వెళుతోన్నట్లు నటిస్తారు. ట్రాలీమీద వాళ్లు వీళ్ల కేసి కొరకొరా చూస్తారు, రైలు గట్టుమీద మళ్ళీ మేపుతున్నందుకు. ఆఫీసరు కేసు చేస్తున్నాడని తోచగానే వీళ్లు "దణ్ణాలండి బాబయ్యా!" మంత్రం పఠిస్తారు, దొంగ భయం నటిస్తూ. అంతే! అది టకటకలాడుతూ వెళ్లిపోగానే పోయాడ్రా నా.." అని వాణ్ణి తిట్టుకుంటూ బైటాయిస్తారు, ఆ ట్రాలీకేసే చూస్తూ. దాన్ని చూస్తే వీళ్లకు వింత. "దాని కింజనూ ఉండదు, ఏమీ ఉండదు. కింద నాలుగు చక్రాలు, పైన నాలుగు కర్రలూ అంతేన్రా!" అని ఒకడు.

"వాళ్లు బలేగా పరుగెడతారు పట్టాలమీద! పరుగెట్టి పరుగెట్టి బండిమీద కూకుం


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువానవగు. "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి దగ్గరా జబ్బుల రానీయదు "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు 500/-

GENERAL LABORATARIES,
(H. O) P O Rajdhanwar (H Bagh)

## ★ రైలుకట్ట ★

టారు. బండి దానంతటదే బలే స్పీడుగా పోతాద" రెండోవాడు "వాళ్లకు బలే సార్వీసులా! మనం నాలుగడుగులేస్తే, తూలి కింద పడతాం" మూడోవాడు.

పదకొండు గంటలవేళకు చేరుకుంటారు నడుము వంగిపోయిన ముసలమ్మలు, నడుసు రాని ఆడపిల్లలు—పేడతట్టలు చంక బెట్టు కుని. గుడ్డలతోను తాళ్లతోను కట్టుకున్న పాదరక్షలతో వాళ్ళు ఒకరితో ఒకర పోట్లాడుకొనే విధానం చూస్తే, వృద్ధాప్యం రెండవ బాల్యదశ అనే షేక్స్పియరు మాట


# డాల్డా

పోటీ

## ముగింపు తేది అక్టోబర్ 15 వరకు పొడిగింపబడినది

జనులకు సౌకర్యముగా నుండుటకై డాల్డాక్విజ్ పోటీ అక్టోబర్ 15, 1955 వరకు పొడిగింపబడినది. ఒక పెద్ద బహుమతిని పొందేటందుకు ఈ తరుణమును ఇంక విడిచిపెట్టియుండినయెడల ఇదే మంచి అవకాశము. మీ ఎంట్రీ ఫార్మ్‌ను ఇదివరకే పంపియుండినయెడల, ఎందుకు ఇంకొక దానిని పంపించకూడదు?

### ముఖ్యము

అక్టోబర్ 31, 1955వ ఈ పత్రికలో తీర్పరుల నిర్ణయము ప్రకటించబడును. గెలుపొందినవారి పేర్లు నవంబర్ 30, 1955వ ఈ పత్రికలో ప్రకటించబడును.

మొదటి బహుమానము...
రు. 20,001*
రెండవ బహుమానము...
రు. 5,001




* మొదటి బహుమతిని గెలుపొందిన వారు ఒక్కరుగాని లేక అందరూ కలిసి గాని అదనపు రు 20,001లను నిర్ధిష్ట అప్పత్రికిగాని లేక ధార్మికుగాని యిచ్చే హక్కును గూడ గలిగియుందురు.

**ఒక ఎంట్రీ ఫారమ్‌ను మీ డాల్డా వ్యాపారివద్ద తీసుకోండి**

(బొంబాయి, హైదరాబాద, సౌరాష్ట్ర మరియు మైసూరు రాష్ట్రములందు నివసించువారు తప్ప) తదితరులందరూ పాల్గొనవచ్చును.

HVM. 259-X57 TL

గుర్రుకొస్తుంది. వాళ్లు పేకళ్లు పంచుకోడం మరిచిపోయి, గేదెలను, ఆవులను, పంచుకుంటారు. "మా కొడుంగు సత్తిరాజు గారి గేదెలన్నీ నావి మా బుల్లెంకడు కాఫీ గేదెలన్నీ నావి" అంటుందో పిల్ల. అంతటితో ముసలిదాని కోపం తారాజువ్వలాగ లేచి, నిసింద్రీలా చీదేస్తుంది. "ఆ! మహా నువ్వు గడించావు సత్తిరాజు గార్ని, సత్తిరాజు గారి గేదెల్ని! నక్క పుట్టి నాలు గాదివారాలు కాలేదు గాని..." అని ఆ కోపంలో నోరు తిరక్క ఆయాసం వచ్చి వగరుస్తుంది.

ఇంకా కొంతసుంది యీ బాపతే వస్తారు పెదపెద్ద గంపలతో. ఎండిన పుల్లలు, తాటి ఆకులు, కమ్మలు, పులకలు, తీసేసిన దుంజాలు, పొయ్యిలోకి తీసికెళ్లడానికి. పుంతలవెంబడే బయలుదేరతారు బతికున్న చెట్టువీ, చచ్చిపోయిన చెట్టువీ, పనికొచ్చే చెట్టువీ, పనికిరాని చెట్టువీ, పచ్చివీ, ఎండువీ అనే విచక్షత లేకుండా గంపనిండటమే ప్రధానం అందరూ పొలాల్లో పనుల హడావుడిలో ఉండే సమయం కనుక అంతా గప్ చిప్. ఇటువంటివాళ్లె కవళ్లతోనూ, సంబంధం ఉంచకూడగు, ఉంచరు. కావంటే గంపనింపి, నిండా పేర్చుకొన్న తర్వాత దారిపోయే దానయ్య ఎవడైనా గంప తలకెత్తితే చాలు. మళ్లీ ఆ ఎండలోనే రెండు గంటలయ్యే వేళకు యింటికి చేరుకుంటారు పొయ్యి రాజెయ్యడానికి.

పన్నెండు గంటలయ్యే వేళకు వస్తారు రైతుల కూతుళ్లు, భార్యలు, ముసలి తల్లులు —యింటివద్ద ఎవరు ఖాళీగా ఉంటే వాళ్లు తట్టలలో టిఫిన్ కారియర్లు, గిన్నెలతో, అన్నం, పప్పు చారు, మజ్జిగ, నంచుకో నేందుకు పచ్చడితో సహా!

సరి! ఆ వేళకి ఆ వాడ వాడంతా పొలిమేర తెత్తించేసిన ఊడ్పులు ఊడ్చే, కలుపులు తీసే, నీళ్లు తోడే ఆడవాళ్ల పాటలు, కథలు చెప్పడం, ఊకొట్టడం మొదలైన జానపద గేయాలు, పదాలు, పాటలు, సరాగాలు, క్రమంగా సన్నగిల్లి, నీరసించి గబుక్కి కొళ్లు కనుక్కుంటాయి.

చెరువుగట్టుమీద మామిడి చెట్టులు, నిద్రగన్నేరు చెట్ల నీడల్నీ, తాటి తోపుల్లోనూ, అన్నం గిన్నెలు, మంచినీళ్లూ దగ్గర పెట్టుకొని, గుంపులు గుంపులుగా చేరి సరస సల్లాపాలతో ఆరగిస్తారు.

ఒక్క గడియసేపు అల్లా కూర్చుంటారో లేదో, మళ్లీ చేలల్లో దిగుతారు గేయాలు, పదాలు, పాటలు, కథలు మళ్లీ మొదలు. ఆ పచ్చటి చేలల్లో రంగురంగుల చీరలతో ఆ కాపుపడుచులు వసంతకాలంలో నిండుగా పుష్పించిన చెట్లగుబురలో సీతాకోక చిలుకలవలె కనిపిస్తారు, రైళ్లలో వచ్చేపోయే జనానికి.


"భంయ్"మని గర్జించే కెనెడియన్ ఇంజన్లకు ఉలిక్కిపడి వంచిన నడుములెత్తి విలాస విభ్రమాలతో కళ్లు పెద్దవిచేసి, రోకలి బండలా సాగిపోయే రైలుబండిని చూసి మళ్లీ నడుము వంచుతారు.

ఈలోగా ఆకాశంలో పడమటిమూల గుడ్డపేలికంత మబ్బుపింజ బయలుదేరి నింపాదిగా ఆకాశ మధ్యానికొచ్చేటప్పటికి ఇంతింతై వటుడింతయై మరియు తా నింతై నభోవిధిపై కారు నలుపెక్కేసరికి వాళ్లలో ఒక భీతహరిణేక్షణ, తన కాటుక కళ్లు పెద్దవిచేసి, ఆకాశంవైపు చూసి, ఒక్కసారి మూర్ఛపోయినంత పనిచేసి, కెమలిలా కేక పెడుతుంది. "ఓ లబ్బో! కూసింత సేపట్లో యంత మబ్బెట్టిందో! దీని జిమ్మడా! రోజూ యీ యాలకే మూసుకొనిపోతుంది పుట్టి మునిగిపోయినట్టు." అది విని మిగిలిన ముద్దలందరూ, తమ మోవలోదనాలను మిలమిలలాడించేసరికి, ఆ మేఘునికికూడా కొంటెతనం పుట్టుకొచ్చి, వాళ్ళందరినీ తాకాలని, ఒక్కసారి కడుపు పగిలేటట్టు ఫెళఫెళా నవ్వేసరికి, ఆ మెఱుపులకు కళ్లు అప్పళించుకొని, తూలిపడకండా ఒకళ్ళ నొకళ్లు ఆసరా చేసికొని, ఒకళ్ల మొగాలొకళ్లు చూసుకుంటారు.

ఇంతలోకే మబ్బు [illegible] చేరకుండా, కడుపు పట్టినట్టు. నీళ్లు [illegible] గ్రేవ్ మనేసరికి వీళ్ళ చెవుల్లో హోరుమంటుంది. వీళ్ళందరూ బేజారెత్తి, ఏవైపు నుంచి వస్తాందో అని కలయజూసేసరికి అప్పుడే హొటర్ సిగ్నల్ దగ్గర కొచ్చేస్తుంది వానజడి. అందరూ చేతులలోని నారకట్టలు, కలుపుకట్టలూ, ఎక్కడివక్కడ వదిలేసి, పొలోమంటూ గట్టెక్కేసి, పశువుల సాలలోనికి దూరేలోగా, వీపువెంబడే తరుముకొనివచ్చి, ఒక్కసారి ఛళేలు మనిపించి, చీరకొంగులు తడిపి తీరతాడు పసిపట్టి, పంతంపట్టిన మేఘుడు. వీళ్లందరూ సాలలో పొళ్లగోడకు దూరంగా నిలబడి, కుంభవృష్టిగా కురిసే వర్షానికి వచ్చే చూరు నీళ్ళల్లో కాళ్లు కడుక్కుని తుడుచుకొనేలోగా, చల్లని వానజల్లు తుంపరలకు ఝల్లు ఝల్లుమని పులకించి, తడిసిన రవికల పసిమి వర్ణానికి నిళ్ళులపై, మిట్టపల్లాలకు మిలమిలలాడే కొంటెగాళ్ల కళ్లకు పమిట తెరలు కప్పేస్తారు.

నాలుగున్నర, అయిదు అయ్యేసరికి మా ఊరిలో సగం జనాభా ఆ రైలుగట్టుమీదే ఉంటారు.

ఎలిమెంటరీస్కూలు పిల్లలు బడి వదలగానే పలకా, పుస్తకాలు యింట్లో గిరవాటు పెట్టి ఎనిమిదీ పన్నెండేళ్ళ మధ్య పిల్లలు ఒక జట్టుగా కూడి బయలుదేరతారు,



# ★ రైలుకట్ట ★

రైలుపట్టాలమీద నడుస్తూ, ఆడుతూ, గంతులేస్తూ, కబుర్లు చెప్పుకుంటూ, కేరింతాలు గొడుతూ, వింతలు, విశేషాలు చెప్పుకుంటూ.

హైస్కూలు పిల్లలు స్కూలు వదలగానే స్నానంచేసి, యిస్త్రీ బట్టలు వేసికొని, ముఖానికింత ఫేసుపౌడరు కొట్టుకొని 'చప్పల్సు' వేసుకొని షైరు బయలుదేరుతారు స్నేహితులంతా కలిసి, స్కూలులో టీచర్సును, విద్యార్థుల మధ్య పాలిటిక్సును తీవ్రంగా విమర్శించుకొంటూ.

పనీ, తీరుబడీ లేని పాతికేళ్ళ యువకులంతా గ్లాసో పంచె, లాల్చీ, కూలింగ్ గ్లాసెస్. రిస్టువాచీలతో షోకేళీలుగా తయారయి, సినీమా పత్రిక చేతబట్టుకుని, సినీమాలనూ, సినీతారలనూ విమర్శిస్తూ, ఆవూళ్లో ఎవరు, ఏ తారలను పోలివుంటారో చెప్పుకుంటూంటారు.

వయస్సు మళ్లి పాటు పడలేనివాళ్లు కర్ర చేతో పుచ్చుకుని, తాపీగా నడుస్తూ, ఆ చల్లటిగాలిలో తమ సాయం వాహ్యాళివల్ల తమ ఆరోగ్యము ఎంత బాగుపడుతుందో అని వూహించుకుంటూ, వాళ్ళ రోజుల్లో అన్నీ ఎంత "యిది"గా ఉండేవో, యిప్పుడెల్లా తగులబడిపోతున్నాయో, ఆలోచించుకుంటూ, రైలు వెనకనుంచైనా, ముందునుంచైనా వస్తూందేమోనని ఎండకు చెయ్యి అడ్డుపెట్టి దూరంచూస్తూ, ఎక్కడ కూర్చోటానికి తగినంత శుభ్రంగా కనబడక, ఇంక పొద్దుకుంకితే కన్ను కనబడదనీ, పురుగూ పుట్రా ఉంటాయనీ, సణుక్కుంటూ ఇంటిదారి పడతారు; దోవలో కనబడిన మనుషుణ్ణి చీకటిపడకుండా యింటికి చేరుకోమని హెచ్చరిస్తూ.

ఆరుగంటలకు, అస్తమించే సూర్యుని అరుణకాంతులు సున్నటి రైలుపట్టాలమీద ప్రతిఫలించి పట్టాగుండా మనం ఎంతదూరం వెడితే అంతదూరం మనకూడా వస్తాంటాయి.

ఊడ్పులకుపోయిన కాపు పడుచులు చీకటిపడిపోతోందనీ, ఇంటిదగ్గర పిల్ల లేడుస్తారనీ, వెళ్ళి వంట చేసుకోవాలనీ, తొందరపడుతూ, చిన్నచిన్న పరుగులతో, సూచించే వేగిరపాటులోని గలగలలు, గూళ్లకు చేరుకునే పక్షుల కలకలంతో కలిసి చీకటితో మెలసి, చెట్ల గుబుర్లలో నిండుకుంటాయి.

ఏడుగంటలకు రైలుకట్ట పొడుగునా, వెలుగు వెల్లువై, పెద్ద ధ్వనితో భూమిని దద్దరిల్లజేసి, టకటక శబ్దించి, కన్నుమూసి తెరచే అంతలో శరవేగంతోపోయే జనతా ఎక్స్ప్రెస్ వెనుక, రైలుకట్ట మరింత గాఢాంధకారంలో మునిగిపోతుంది.

ఆ తరువాత—అప్పుడప్పుడు వచ్చే రైలుబళ్ళు, రెండువైపులా నీళ్ళదొరువులలోని కప్పల బెకబెకలు, కంకరరాళ్లలోని కీచురాళ్ళ కీచుధ్వనులు, పట్టాలక్రింద మెదిలే ఎలుకలు, పాము పిల్లలు, నిశ్చలమైన పంటచెరువులలో ప్రతిబింబించే నీలాకాశపు నక్షత్రాలకు తోడు జీబురుమనే చెట్లనిండా ముసురుకొని మిణుకు మిణుకుమనే మిణుగురు పురుగుల విలాస చలనాలు. నిద్రలో కలవరించే కులాయాల్లోని పక్షుల కువకువలు. నిశీథపు నిశ్శబ్దాన్ని నిలువుగా చీల్చే దివాంధరుతి. ఎండకు ఎండి, వానకు తడిసి, మంచుకు బిగిసే రైలుపట్టాలు - మేకులకు కర్రలకు బిగించబడిన రైలుపట్టాలు - ప్రతిదినము లక్షలకొలది జనాన్ని, వారి సామాన్లను మోసుకొనిపోయే రైళ్ళ వేగానికి భుజాలు దిగిపోయి, నడుములు వంగి, జవసత్వా లుడిగిన రైలుపట్టాలు - విశ్రాంతరాత్రి కాలంలో, మృత్యుశీతలమైన కాళరాత్రి గర్భంలో విశ్వేశ్వరునిముందు సాష్టాంగపడుకొని సత్యాగ్రహం సాగించే రైలుపట్టాలు. ★




ఆంధ్రప్రదేశ్ ఏజెంట్లు మెసర్సు. ఏ ఆర్. ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ